క్లుప్తంగా

'ఎర్నిమాంబ' హుండీ ఆదాయం రూ. 7.6 లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది.. పర్యవేక్షిస్తున్న అధికారులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. 26 రోజులకుగాను అమ్మవారి దర్శనాలకు సంబంధించిన హుండీల ఆదాయం రూ.7,68,361 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ.శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎల్ నరసింహం పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు. దేవదాయశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

రామాలయానికి మైక్ సెట్ వితరణ



మైక్ సెట్ అందజేస్తున్న కందుల నాగరాజు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు ఎస్సీ కాలనీలో గల శ్రీ రామ, సాయిబాబా ఆలయానికి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు బుధవారం మైక్‌సెట్, యాంప్లిఫైర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ప్రత్యేకంగా ఆహ్వానం పలికి, ఆయన పేరిట భగవంతునికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సహాయం అడగ్గానే అందజేసిన కందుల నాగరాజుకు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కందుల నాగరాజు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాధురి, లక్ష్మీకాంతం, రవణమ్మ, త్రివేణి, తిరుమల, లక్ష్మి, తెలుగు అర్జున్, ఆదిబాబు, 32వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి కందుల బద్రీనాథ్, కందుల కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యువజనోత్సవాలు

మహారాణిపేట: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 26వ జాతీయ యువజనోత్సవాలు గురువారం నుంచి ఈనెల 16 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని హుబ్లీ–ధార్వాడ్‌లో గురువారం సాయంత్రం 4 గంటలకు జాతీయ యువజనోత్సవాలు–2023ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్టు సెట్విస్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి పి.నాగేశ్వరరావు తెలిపారు. https// pmindiawebcast. in ద్వారా అందరు ఈ కార్యక్రమాన్ని వీక్షించవచ్చునని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి టన్నెల్ అక్వేరియం ప్రదర్శన

ఏయూ క్యాంపస్: బీచ్‌రోడ్డులోని పోలీస్ మెస్ వెనుకనున్న ఏయూ మైదానంలో అండర్ వాటర్ టన్నెల్ అక్వేరియంతో పాటు హ్యాండ్‌ల్యూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకుడు రాజారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం ఎగ్జిబిషన్ వేదికగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విదేశాలలో చూసే టన్నెల్ అక్వేరియంను తొలిసారిగా విశాఖ ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. వందల జాతులకు చెందిన చేపలు కనువిందు చేస్తాయన్నారు. శుక్రవారం నుంచి ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందని, సుమారు మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుందని చెప్పారు. దీని పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా నిపుణులైన సిబ్బంది నిరంతరం పని చేస్తారన్నారు. ఎమ్యూజిమెంట్ పార్క్‌లో గతంలో లేని విధంగా సునామీ, డ్రీమింగ్ టవర్, టెక్నోజంప్ వంటి 15 రైడ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు వందకుపైగా వస్త్ర, అలంకరణ, హస్తకళ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయన్నారు.

ఊరంతా సంక్రాంతి



కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌ను సత్కరిస్తున్న నర్సులు



పోలీసు కుటుంబ సభ్యుల మధ్య సీపీ, డీసీపీ-1 సతీమణులు విజయలక్ష్మి, అనీషా



భోగి మంటలు వెలిగిస్తున్న ముఖ్య అతిథులు

మహారాణిపేట : కేజీహెచ్‌కు సంక్రాంతి ముందుగానే వచ్చిందని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ అన్నారు. బుధవారం కేజీహెచ్‌లోని నర్సుల విభాగం ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి అన్నారు. ఈ పండగను వయోభేదం లేకుండా ఘనంగా జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ ఆర్ఎంవోలు డాక్టర్ జగదీశ్వరరావు, డాక్టర్ వాసుదేవ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, మేనేజర్ శేషాద్రిశర్మ, స్టాఫ్ నర్సులు డి.లక్ష్మి, ఎం.ప్రశాంతి, పి.వరలక్ష్మి, పి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ అశోకకుమార్‌ను సన్మానించారు.



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న తోట పద్మావతి తదితరులు

దేశానికే ఆదర్శం..

అల్లిపురం: తెలుగువారి సంక్రాంతి దేశానికే ఆదర్శమని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. కొత్త పంటలు రైతు ఇంటికి వచ్చిన వేళ సంతోషంగా జరుపుకునేదే సంక్రాంతి అన్నారు. కొబ్బరితోట–1 సచివాలయంలో బుధవారం సచివాలయ సిబ్బంది సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శులు, గత రెండు సంవత్సరాలుగా కరోనా కారణంగా సంక్రాంతి పండగలో మాధుర్యం లేదన్నారు. ఈ ఏడాది అన్నీ సర్దుకున్నందున అందరూ సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వలంటీర్లు సచివాలయం ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి, చెరుకు గడలు నిలిపి ఆట పాటలతో సందడిగా గడిపారు. అనంతరం సచివాలయ సిబ్బందికి మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు లండా రమణ, దూడ అప్పారావు, రాములమ్మ, కార్యదర్శులు లిఖిత, వాసు, సత్య, ప్రియాంక, వలంటీర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

ఏఆర్ పోలీస్ గ్రౌండ్స్‌లో..

అల్లిపురం : సూర్యాబాగ్ ఏఆర్ పోలీస్ గ్రౌండ్స్‌లో బుధవారం పోలీసు కుటుంబ సభ్యులు సంక్రాంతి సంబరాలు ఉల్లాసంగా, ఉత్సాహంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు పోలీస్ కుటుంబ సభ్యులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ భార్య సీహెచ్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డీసీపీ–1 సతీమణి అనీషా పాల్గొని పోలీసు కుటుంబ సభ్యులు వేసిన ముగ్గులు పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బోగి మంటలు వేసి, హరిదాసులు, గంగిరెద్దుల పాటలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పని ఒత్తిడి ఉన్నా పండగల సమయాల్లో ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు జరుపుకోవాలన్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా కుడార్తై ఉత్సవం

ఘనంగా ధనుర్మాసం 28వ రోజు పూజలు



విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. 28వ రోజు కార్యక్రమంలో భాగంగా కుడారై ఉత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. తెల్లవారు జాము 5 గంటల నుంచి స్వామి వారికి తిరుప్పావై 28వ పాశురం విన్నవించుకున్నారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి, గోదాదేవి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తయారు చేసిన కుడారై పాయసాన్ని 108 మట్టి కలశాలలో నివేదించారు. ఈ సందర్భంగా భక్తుల ఓం నమో వేంకటేశాయ నామంతో ఆ ప్రాంతం మార్మోగింది. భక్తులకు అంతరాలయ దర్శనం కల్పించిన అనంతరం పాయశంతో కూడిన కుండలను పంపిణీ చేశారు.



ప్రసన్న వేంకటేశ్వరస్వామి, గోదాదేవి ఉత్సవ విగ్రహాల వద్ద నివేదించిన కుడారై పాయసం కుండలు

అలిమేలు మంగమ్మ ఆలయంలో..

వెంకటేశ్వరమెట్టపై గల అలిమేలు మంగమ్మ ఆలయంలో గోదాదేవికి కుడారై సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు పి.కేశవాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. పెళ్లి కావాల్సిన ఆడపిల్లలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుడారై పాయసం భక్తులకు పంపిణీ చేశారు. భక్తులు గోవిందుడిని స్తుతిస్తూ భక్తి గీతాలు పాడి సందడి చేశారు.

పరిశుభ్రతే ప్రధాన ధ్యేయం



వార్డులో పర్యటిస్తున్న జెడ్సీ శివప్రసాద్, వసంతలక్ష్మి, శ్రీహరిరెడ్డి తదితరులు

అల్లిపురం: వార్డులో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పాడైన డస్ట్‌బిన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని జోన్–4 జెడ్సీ పి.శివప్రసాద్ సిబ్బందికి సూచించారు. 33వ వార్డులో బుధవారం ఆయన వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మితో కలిసి క్షేత్ర స్థాయి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో వెంకటేశ్వరమెట్ట–1, 2 సచివాలయాలతో పాటు కుమ్మరవీధి సచివాలయాన్ని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ వుడ్‌యార్డ్ సచివాలయం వార్డుకు దూరంగా ఏర్పాటు చేయటం వలన వలంటీర్లు, ప్రజలకు ఇబ్బందిగా ఉందని, సచివాలయాన్ని కుమ్మరవీధి సచివాలయం మేడపైన ఖాళీగా ఉన్న హాల్లోకి మార్పు చేయాలని కోరారు. జీవీఎంసీ కమిషనర్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు పలుమార్లు విన్నవించినట్లు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో మాట్లాడి సచివాలయం తరలింపునకు కృషి చేస్తానని జెడ్సీ తెలిపారు. అనంతరం ఆయన వార్డులో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ కాలువ పనులను పరిశీలించారు. కాలువలపై త్వరితగతిన పలకలు ఏర్పాటు చేయాలని ఏఈ సలీమ్‌ను ఆదేశించారు. వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి ప్రజల అవసరాలకు కల్యాణ మండపం నిర్మాణానికి సహకారం అందజేయాలని కోరారు. వార్డులో ప్రభుత్వ స్థలాలు పరిశీలించి వీలైనంత త్వరగా కల్యాణమండపం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పర్యటనలో అడ్మిన్లు త్రివేణి, రియాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, వలంటీర్లు, ఆర్పీలు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఔదార్యం



వికలాంగ విద్యార్థి ఖాదర్‌ఖాన్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తన సొంత నిధులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురికి ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. 33వ వార్డు నారాయణవీధిలో నివసిస్తున్న వికలాంగ విద్యార్థి ఖాదర్‌ఖాన్ గ్రాఫిక్ డిజైనింగ్ కోర్సుకు ఫీజు కట్టాలంటే రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసి, ఇనిస్టిట్యూట్ యాజమాన్యంతో మాట్లాడి ఫీజు రాయితీ కల్పించారు. అలాగే 39వ వార్డు చిలకపేటలో వికలాంగ మహిళ దూడ కొర్లమ్మకు మందుల కొనుగోలుకు రూ.వెయ్యి, అదే వార్డు సోల్జర్స్‌పేటలో నివసిస్తున్న చేపల సోమేశ్వరికి రూ.500, 31వ వార్డుకు చెందిన కోడి అరుణ పిల్లల స్కూల్ ఫీజుల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేయడమే కాక స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి ఫీజు రాయితీ మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

పారిశుద్ధ్య సిబ్బందికి దుప్పట్ల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న శ్రీవత్సవ్

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రముఖ సంఘ సేవకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని పారిశుధ్య సిబ్బందికి దుప్పట్లు అందజేశారు. అలాగే వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులకు ఆటోమేటిక్ కంప్యూటర్ కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేది పారిశుధ్య కార్మికులని, తన తండ్రిగారు ద్రోణంరాజు శ్రీనివాసరావు కూడా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికులదే ప్రథమ పాత్రని చెప్పేవారన్నారు. ఒకానొక సందర్భంలో వారి పాదాలు కూడా కడిగారని చెప్పారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపడుతున్న వివేకానంద సంస్థను అభినందించారు. ఈ సందర్భంగా 39వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగరాజుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, డీఎస్ అగర్వాల్, అప్పలకొండ, దూడ రాజు, ముత్యాలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మహేష్

సింహాచలం : జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ దరి ఎస్‌బీసీ కాలనీ, శ్రమశక్తినగర్‌లో పైపులైన్ అభివృద్ధి పనులకు బుధవారం వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మెంటి మహేష్ శంకుస్థాపన చేశారు. ఈ రెండు ప్రాంతాల్లో ఇటీవల ఎమ్మెల్యే అదీప్‌రాజ్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేయడంతో నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ప్రాధాన్యత పనులను చేసేందుకు సంకల్పించారు. దీనిలో భాగంగా రెండు ఏరియాల్లో పైపులైన్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముచ్చకర్ల దరప, మెంటి సూరిబాబు, ముమ్మన మహాలక్ష్మినాయుడు, సూరిబాబు, సాంబమూర్తి రమణమూర్తి, చంద్రశేఖర్, ఏఈ రాజశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



1964 సీబీఎం హైస్కూల్ ఎస్ఎస్‌సీ విద్యార్థులు

అల్లిపురం: నగరంలోనిసీబీఎం హైస్కూల్ 1964 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు సోమవారం రాత్రి నగరంలోని ఒక హోటల్లో కలుసుకుని సందడి చేశారు. వివిధ హోదాల్లో పని చేసిన వారు, వ్యాపారులుగా స్థిరపడిన వారు సమావేశమై అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వారంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. తమ బ్యాచ్‌లో ఉన్నవారిలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారి సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన బీసీహెచ్ మసేను, కార్యదర్శి కంకటాల ప్రభాకర్ తీర్మానించారు. భవిష్యత్‌లో కూడా సమావేశాలు నిర్వహించి సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని వారు అభిప్రాయపడ్డారు.

కలెక్టర్, జేసీలకు ధన్యవాదాలు



కలెక్టర్ మల్లికార్జునను సన్మానిస్తున్న కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవో శిరీష

మహారాణిపేట : శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గతేడాది నవంబర్ 24 నుంచి డిసెంబర్ 23వ తేదీ వరకు జరిగిన మార్గశిర మాసోత్సవాలు విజయవంతమయ్యేందుకు సహాయ సహకారాలు అందించిన కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జేసీ కె.ఎస్.విశ్వనాథన్‌లకు దేవస్థానం ఈవో కె.శిరీష కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం వారిని కలిసి సన్మానం చేశారు. అమ్మవారి ఫొటో, ప్రసాదం అందజేశారు. ఉత్సవాలు విజయవంతం కావడం, ఆలయ ఆదాయం రూ.4.5 కోట్లు రావడంలో వివిధ ప్రభుత్వ శాఖల సహకారం మరువలేనిదని ఈవో అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుని కుటుంబానికి ఆర్థికసాయం



గౌస్ కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మైనార్టీ నాయకులు

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధి 30వ వార్డు తాడివీధి(కుమ్మరవీధి)లో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదంతో సయ్యద్ గౌస్ ఇల్లు, ఇంట్లో పరికరాలు పూర్తిగా కాలిబూడిదైన విషయం తెలిసిందే. కట్టుబట్టలతో రోడ్డున పడ్డ సయ్యద్ గౌస్ కుటుంబానికి మైనార్టీ శాఖ ప్రధాన కార్యదర్శి ఐహెచ్ ఫారూఖీ, 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ ఆలీ మానవతా దృక్పథంతో రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మక్కా మసీదు కమిటీ మాజీ సెక్రటరీ అమీర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ఈకే రచనలు అజరామరం



మాస్టర్ ఈకే ఆంగ్ల గ్రంథాలు ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్ : మాస్టర్ ఈకే రచనలు అజరామరమని, ఆయన జీవన విధానం సాధకులకు మార్గదర్శకంగా ఉంటుందని కులపతి బుక్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ సీహెచ్ఎస్ఎన్ రాజు తెలిపారు. జిల్లా పరిషత్ సమీపాన గల జగద్గురుపీఠం, అంకోశ ఫంక్షన్ హాల్లో బుధవారం 62వ మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవాల్లో మాస్టర్ ఈకే గ్రంథాల ఆవిష్కరణోత్సవంలో పాల్గొని మాట్లాడారు. మాస్టర్ ఈకే శతాధిక గ్రంథాలు రాశారన్నారు. అందులో కొన్ని జర్మన్, స్పానిష్ భాషల్లో అనువదించబడ్డాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎవెల్యూషన్ ఆఫ్ కాన్షస్‌నెస్ ఆఫ్ మేన్ పుస్తకాన్ని, సైన్స్ ఆఫ్ యోగా పుస్తకాన్ని కోల్‌కతా ఇన్‌కంటాక్స్ కమిషనర్ బీఎస్ఎన్ రాజు, సింబాలిజమ్ ఆఫ్ స్క్రిప్చర్ గ్రంథాన్ని జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు గురుపూజలు నిర్వహించనున్నట్టు జగద్గురు పీఠం డైరెక్టర్ ఆఫ్ ఫంక్షన్స్ అజ్జరపు శ్రీనివాస్ తెలిపారు. దేశ విదేశాల నుంచి 1500 మంది సాధకులు పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు.

అధికారులకు పలు డిమాండ్ల నివేదన



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ సన్యాసిరావు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశాలతో కార్మిక సంఘాల ప్రతినిధులతో అదనపు కమిషనర్లు ఎస్ఎస్ వర్మ, వై. శ్రీనివాసరావు, డాక్టర్ వి. సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాలు ప్రధాన డిమాండ్లను అధికారుల ముందు ఉంచాయి. పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనెలు, బ్లీచింగ్, పారలు, చీపుర్లు, గ్లౌజులు, యాప్రాన్లు వంటివి అందించాలని తెలపగా, వాటికి టెండర్ దశ పూర్తయ్యిందని, త్వరలో అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పారిశుధ్య పనులకు, క్లాప్ వాహనాలపై గర్భిణులు, వృద్ధులు, బాలింతలను పంపించొద్దని అడగ్గా, వారికి ఆ విధుల నుంచి మినహాయింపు ఇస్తామని తెలిపారు. మనకున్న కార్మికుల్లో 70 శాతం మంది మహిళా కార్మికులే ఉన్నారని, క్లాప్ వాహనంలో బరువైన పని పెద్దగా ఉండదని, అందువల్ల పంపిస్తున్నట్లు తెలిపారు. 5025 పారిశుధ్య కార్మికులు ఉండాలని, కానీ ప్రస్తుతం 1200 మంది క్లాప్ వాహనాలకు వెళ్తున్నారని, 482 మందిని త్వరలోనే నియామకం చేస్తామన్నారు. మరో 500 మందిని నియమించేందుకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. కార్మికులు ఉదయం 5.30 గంటలకు బదులు 6 గంటల నుంచి వచ్చేలా ఆదేశిస్తామని, కార్మికులకు ఐడీ కార్డు, క్లాప్ డ్రైవర్లకు జీతం, మలేరియా విభాగంలో పనిచేసే వారికి హెల్త్ అలవెన్స్, జీవీఎంసీలో క్యాంటీన్ నిర్వహణ వంటి పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, కౌన్సిల్ అనుమతితో ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలు జీవో ప్రకారం వర్తిస్తాయని అన్నారు. యూనియన్ నాయకులందరూ విశాఖను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా సహాయ సహకారాలు అందించాలని కమిషనర్ తరఫున కోరారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్ కేవీఎన్ రవి, కార్యనిర్వాహక ఇంజనీరు (మెకానికల్) సుబ్బారావు, కార్మిక సంఘాల నాయకులు వెంకటరెడ్డి, సుబ్బారావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ ఎర్రంనాయుడు, ఎస్ఐ శ్రీను

అల్లిపురం: షాపింగ్‌లో జరిగే నేరాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎర్రంనాయుడు సూచించారు. సంక్రాంతి సందర్భంగా ఆయన టూటౌన్ క్రైం ఎస్ఐ కె.శ్రీనుతో కలిసి బుధవారం సాయంత్రం జగదాంబ జంక్షన్‌లో వస్త్ర దుకాణాల వద్ద వినియోగదారులకు అవగాహన కల్పించారు. విలువైన వస్తువులు ధరించి బట్టలు కొనుగోలుకు రాకూడదని,డబ్బులు బ్యాగుల్లో పెట్టి వాహనాల డిక్కీల్లో వదిలి వెళ్లరాదని హెచ్చరించారు. దొంగలు చిల్లర నోట్లు నేలపై పడేసి బ్యాగులు దొంగిలిస్తారని, ఎవరినీ నమ్మవద్దని తెలిపారు. నేరాల నియంత్రణలో పోలీస్ వారితో సహకరించాలని కోరారు. ఊరు వెళ్లే సమయంలో ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను వినియోగించుకోవాలని, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. అలా చేసినట్లయితే పోలీసులు ఆ ఇంటిపై నిఘా ఉంచుతారని, ఒక కెమెరా ఏర్పాటు చేస్తారని వివరించారు. తగిన జాగ్రత్తలు తీసుకుని స్వగ్రామాల్లో పండగను ఆనందంగా గడపాలని ఆయన తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోండి

డాబాగార్డెన్స్: పండగ వేళ అందరూ బిజీగా ఉంటారని, చాలా మంది ఊళ్లకు వెళ్తుంటారని అలాంటప్పుడు దొంగతనాలకు ఆస్కారమివ్వరాదని హార్బర్ సబ్ డివిజన్ సీఐ అవతారం హెచ్చరించారు. బుధవారం వన్‌టౌన్ ప్రాంతంలో గల బంగారు దుకాణ యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దుకాణాల ముందు నిఘా ఏర్పాటు చేసుకోవాలని, విలువైన వస్తువులు లాకర్లలో సేఫ్‌గా ఉంచుకోవాలని సీఐ సూచించారు.



కురుపాం మార్కెట్ బంగారు వర్తకులతో సమావేశమైన సీఐ అవతారం